నిబంధనల మేరకే కౌంటింగ్ ఏర్పాట్లు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 23: ఎన్నికల సంఘం నిబంధనల మేరకే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న దృష్ట్యా గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోని కౌంటింగ్ సెంటర్ల వద్ద మూడంచల భద్రతా వ్యవస్థ అమలు ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్‌కు సంబంధించిన సమాచారం పోటీలు ఉన్న అభ్యర్థులకు తెలియజేయడం తదితర అంశాలపై చర్చించారు. సంబంధిత ఏఆర్‌ఓలు, కౌంటింగ్ సిబ్బంది గుర్తింపు కార్డులను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పొందాలన్నారు. కౌంటింగ్ రోజు సాధారణ పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బందికి మూడవ ర్యాండమైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డు కలిగిన వారిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సాధారణ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ తెరిచి ముందుగా ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, తరువాత ఈవీఎం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అశ్విని తానాజీ వాకడే, రోహిత్‌సింగ్, వెంకన్న, నారాయణ, మంగీలాల్, డీఆర్‌ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వనారాయణ, రమేశ్, తహసీల్దార్లు ఇక్బాల్, విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాదేశిక ఎన్నికలపై అనిశ్చితి



హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీలు), మండల పరిషత్తుల ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీలు) ఎన్నికలు గడువులోపు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు మాదిరిగానే జిల్లా, మండల పరిషత్తులకు కూడా ప్రత్యేక పాలనాధికారులను నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రాదేశిక నియోజవర్గాల పాలక వర్గాల గడువు జూలై 4వ తేదీతో ముగియనున్నది. వాస్తవానికి 2019లో అప్పటి పాలకవర్గాల గడువు ఐదేళ్లు ముగియక ముందే.. రెండు నెలల ముందుగానే.. అంటే మే 15న ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో అప్పుడు ఎన్నికైన కొత్త పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టడానికి రెండు నెలలు వేచి ఉండాల్సి వచ్చింది. కానీ ఈ సారి గడువు సమీపిస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల సమరంపై కసరత్తు ప్రారంభం కాలేదు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపుతో లోకసభ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే దిశగా ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. మూడు విడతలుగా జరిగే ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడానికి కనీసం రెండు నెలలైనా పడుతుంది. అప్పటికీ ప్రాదేశిక పాలకవర్గాల గడువు ముగుస్తుంది. ఆతర్వాతగానీ ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేపట్టే అవకాశాలు లేవు. అయితే పంచాయతీ ఎన్నికల కన్నా ప్రాదేశిక ఎన్నికల విషయంలో కొంత అనిశ్చితి నెలకొని ఉన్నది. స్పష్టత రావడానికి రాష్ట్ర ప్రభుత్వం కొంత ముందస్తు కసరత్తు చేయాల్సి ఉన్నది.

పునర్విభజనతో..

2019లో ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగి జడ్పీలు కొలువు దీరిన తర్వాత తదనంతర కాలంలో కొన్ని జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగింది. దీనితో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మార్పు జరిగింది. ఒక జిల్లాలో ఉన్న ప్రాదేశిక నియోజకవర్గాలు మరో జిల్లా పరిధిలోకి వెళ్లాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలు హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా మారడం ఇందుకు ఉదాహరణ. అయితే అప్పటికే జిల్లా ప్రజాపరిషత్తు, మండల ప్రజాపరిషత్తులు కొలువు తీరడం వల్ల అవి ఇప్పటి వరకు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతూ వస్తున్నాయి. ఇప్పుడు ప్రాదేశిక ఎన్నికలు కొత్తగా చేరిన జడ్పీటీసీలు, ఎంపీటీలను కలుపుకొని ఎన్నికలు నిర్వహిస్తారు.

మొదలుకాని కసరత్తు

జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలంటే రిజర్వేషన్లు, ఓటర్ల ముసాయిదా జాబితా, పోలింగ్ బూత్‌ల ఎంపిక, అధికారులకు శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటి వరకు ఈ ప్రక్రియలేవి ప్రారంభం కాలేదు. ఒక వేళ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా పనులన్నీ చక్కబెట్టాలంటే కనీసం మూడు నెలలైనా పట్టే అవకాశం ఉన్నట్టు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అంటే గడువులోపు ఎన్నికలు జరగడం అసాధ్యంగా కనిపిస్తోంది.

ఇప్పటికప్పుడు అసాధ్యం

ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినా క్షేత్ర స్థాయిలో వీలు పడకపోవచ్చు. 2019లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 71 జడ్పీటీసీలు, 1,030 మండల ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ) ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించిన సమయంలో కొత్తగా అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ చట్టం ప్రకారం అప్పటి రిజర్వేషన్లు రెండు పర్యాయాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దృష్ట్యా ఈసారి కూడా అవే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. కానీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. గత ప్రభుత్వం హయాంలో రాజకీయ ప్రాబల్యాలను దృష్టిలో పెట్టుకొని కొత్త మండలాల ఏర్పాటు జరిగింది. ఎన్నికల అనంతర కాలంలో కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని కొత్త మండలాలు కూడా ఏర్పడ్డాయి. జిల్లాల పునర్విభజన జరిగింది. ఈ క్రమంలో ములుగు జిల్లా కొత్తగా ఏర్పాటైంది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా స్థానే హనుమకొండ, వరంగల్ జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మండలాల బదిలీ జరిగింది. ఇలా జరిగినా.. ఈ మండలాలు పాత జడ్పీ పాలక వర్గ పరిధిలోనే ఇప్పటి వరకు కొనసాగుతూ వచ్చాయి. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే కొత్త ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల వివరాలను అడగడంతో వివరాలను పంపించారు. జులై 5తో జిల్లా పరిషత్తు, మండల పరిషత్తుల పాలకవర్గాల గడువు ముగియనుండడంతో తదుపరి ప్రభుత్వ ఆదేశాల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ఆ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

- జూలై 4వతేదీతో ముగియనున్న గడువు
- ఇంకా మొదలుకాని ఎన్నికల కసరత్తు
- ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం
- మండలాల పునర్విభజన, రిజర్వేషన్లపై అస్పష్టత
- గతంలో రెండు నెలలు ముందుగానే ఎన్నికలు
- ఈసారి సకాలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ పోరు జరిగేనా?

జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 71 జడ్పీటీసీ, 1030 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 7 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అవి హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు. జిల్లాల పునర్విభజన ఫలితంగా ఐదు మండలాలు ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల, నడికూడ హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చాయి. దీనితో హనుమకొండ జిల్లాలో జడ్పీటీసీ స్థానాల సంఖ్య 12కు పెరగనున్నది. జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 86 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 16 జడ్పీటీసీలు ఉన్నాయి. ఏడాది కిందట మండలాల పునర్విభజనతో రెండు మండలాలు సీరోలు, ఇనుగుర్తి వచ్చి చేరాయి. దీంతో ఈ జిల్లాలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 18కి చేరనున్నది. ఎంపీటీసీ స్థానాలు 198 ఉన్నాయి. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీలు, 141 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 11 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. కొంత కాలం కిందట పునర్విభజనతో గోరికొత్తపల్లి వచ్చి చేరింది. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరనున్నది. ఎంపీటీసీ స్థానాలు 106 ఉన్నాయి. ములుగు జిల్లాలో 9 జడ్పీటీసీలు ఉన్నాయి. ఎంపీటీసీలు 87. వరంగల్ జిల్లాలో 16 జడ్పీటీసీలు, 412 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

కలెక్టర్ పేరుతో ఫేక్ మెసేజ్‌లు



కలెక్టర్ ప్రావీణ్య పేరిట వచ్చిన ఓ ఫేక్ మెసేజ్

వరంగల్ కలెక్టరేట్, మే 23: కలెక్టర్ ప్రావీణ్య పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించారు. ఈ ఖాతాను ఉపయోగించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారు. కలెక్టర్ మీటింగ్‌లో ఉన్నారని, అర్జెంట్‌గా డబ్బులు కావాలనంటూ శ్రీలంక నెంబర్ నుంచి మెసేజ్ పంపిన నేరగాడు డబ్బులు ఫోన్‌పే చేసి స్ర్కీన్ షాట్‌షేర్ చేయాలని కోరారు. ఈ మెసేజ్‌లను పలువురికి పంపించాడు. దీన్ని గమనించిన కలెక్టర్ ప్రావీణ్య.. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరినీ అప్రమత్తం చేశారు. మోసపూరిత మెసేజ్‌లను నమ్మవద్దని, వెంటనే మెసేజ్‌లను బ్లాక్ చేయాలని కోరారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వరాదని కలెక్టర్ సూచించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి

- ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ సరిగా నెరవేర్చలేదు
- ప్రశ్నించే గొంతుక రాకేష్‌రెడ్డిని గెలిపించాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

న్యూశాయంపేట, మే 23 తెలంగాణ ఉద్యమ సమయంలో ఒక్కసారి కూడా జై తెలంగాణ అనని తెలంగాణ ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ధ్వజమెత్తారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం వర్ధన్నపేట నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్‌రావు మాట్లాడుతూ.. అమరవీరులకు కూడా ఏ ఒక్కరోజు రేవంత్ రెడ్డి నివాళులు అర్పించలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సరిగ్గా నెరవేర్చలేదన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు అని ప్రవేశపెట్టిన స్కీమ్ తుస్సుమందన్నారు. ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి త్వరలోనే రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. గతంలో రైతులను చెప్పుతో కొడతానన్న తీన్మార్ మల్లన్నలాంటి అహంకారి కావాలా..? విద్యావంతుడైన రాకేష్‌రెడ్డి కావాలా..? పట్టభద్రులు తేల్చుకోవాలని హరీష్‌రావు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డి అని, ఈ నెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ నాయకులే నమ్మడం లేదని, ఒక వేళ ఎమ్మెల్సీగా గెలిస్తే కాంగ్రెస్ నాయకులపైనే తిరగబడతాడని కాంగ్రెస్ నాయకులే అనుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న విద్యావంతుడైన రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు విస్మరిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలు బయటపడతాయన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేలా.. అమ్మహస్తం

అమ్మ హస్తం
9 నిత్యావసర సరుకుల పథకం

- రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు
- జనవరి నుంచి తొమ్మిది రకాల వస్తువుల పంపిణీ
- కసరత్తు చేస్తున్న సర్కారు..
- లబ్ధిదారుల్లో ఆనందం

వరంగల్ కలెక్టరేట్, మే 23: రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలతో పేదలు బెంబేలెత్తిపోతున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు అమ్మ హస్తం పేరిట నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంలో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గతంలో తక్కువ ధరకు బియ్యం, గోధుమలు, కిలో ఉల్లిగడ్డ, వంట నూనె, పసుపు, కారంపొడి, ఉప్పు, కందిపప్పు, చింతపండు, చక్కెర ప్యాకెట్ల ద్వారా పంపిణీ చేసేవారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమ్మహస్తం పథకాన్ని రద్దు చేసి కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేశారు. అంత్యోదయ కార్డు ఉన్న లబ్ధిదారులకు చెక్కర అందించారు.

జనవరి నుంచి తొమ్మిది రకాల వస్తువులు..

గత పది సంవత్సరాలుగా కొత్త రేషన్‌కార్డుల జారీ లేకపోవడంతో అనేక మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో నూతనంగా వివాహాలు, పుట్టిన పిల్లలకు రేషన్ కార్డులో పేర్లు ఎక్కించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టు తిరుగుతూనే ఉన్నారు. ఎన్నికల నిర్వహణ అనంతరం రేషన్ కార్డుల జారీ ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. 2025 సంవత్సరం జనవరి నెల సన్న బియ్యం తోపాటు తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు కావాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేసినట్లు తెలిసింది.



సరుకులిస్తే సంతోషమే..



సమ్మెట ఇందిర, కాశిబుగ్గ వరంగల్

రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తే సంతోషమే. ప్రస్తుతం పెరిగిన ధరలతో రోజు గడవడం కష్టంగా మారింది. రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల వస్తువులు పంపిణీ చేస్తే మాలాంటి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటి వరకు బియ్యం మాత్రమే పంపిణీ చేసేవారు. ఇప్పుడు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉంది.

డీలర్ల సేవలను ప్రభుత్వం గుర్తించాలి



బత్తుల రమేశ్‌బాబు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రేషన్ దుకాణాల ద్వారా తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇప్పటి వరకు డీలర్ల దృష్టికి ఈ విషయాన్ని సంబంధిత అధికారులు తీసుకరాలేదు. వచ్చే జనవరి నుంచి రాష్ట్ర ప్రభుత్వం సరుకుల పంపిణీ చేసేందుకు సమాయాత్తం అవుతోందని సమాచారం. రేషన్ డీలర్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం అందించేందుకు చర్యలు చేపట్టాలి.

నేడు పాలిసెట్

- వరంగల్‌లో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 5,624 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2024 శుక్రవారం జరుగనుంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పాలిసెట్ వరంగల్ కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 5,624 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. కాగా పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కన్వీనర్ ప్రభాకర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలివే..

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్, ఏవీవీ జూనియర్ కళాశాల, లాల్‌బహదూర్ డిగ్రీ కళాశాల, లాల్‌బహదూర్ పీజీ కళాశాల, లాల్‌బహదూర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ, మాస్టర్‌జీ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, న్యూసైన్స్ డిగ్రీ కాలేజ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ డిగ్రీ, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయండి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ఇంజనీరింగ్ అధికారులతో డిసిల్టింగ్ పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 23: గ్రేటర్ వరంగల్ పరిధిలోని గడువులోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో డిసిల్టింగ్ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరిగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏఈల వారిగా జరుగుతున్న పనులు సాంకేతిక లోపం లేకుండా టెక్నికల్ అధికారులను సమన్వయం చేసుకుని పనుల పురోగతి సాగించాలన్నారు. వరంగల్ బల్దియా పరిదిలో 85 చోట్ల పనులు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పనుల నాణ్యతను తెలుసుకోవాలని చెప్పారు. హెడ్‌మాస్టర్ల లిస్ట్‌లో పనులు పెండింగ్‌లో ఉంటే పై అధికారులకు తెలపాలన్నారు. పాఠశాలలో పనుల నిర్వహణ పట్ల స్పష్టత ఉండాలన్నారు. ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టని పాఠశాలలో వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఏఈలు నిర్దిష్ట గడువులో పనులు పూర్తి చేయాలన్నారు.

ఇంకా డిసిల్టింగ్ పనులలో యంత్రాలు వెళ్లలేని ప్రాంతాలకు మ్యాన్‌వల్‌గా పనులు నిర్వహించాలన్నారు. డిసిల్టింగ్‌కు సంబంధించిన పూర్తి సమాచారం అధికారుల వద్ద ఉండాలన్నారు. ఇరిగేషన్ విభాగం అధికారులను సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. హనుమకొండ పరిధిలో డిసిల్టింగ్ పనులలో నాణ్యత లోపించిందని విముఖత వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, శివానంద్, రంగారావు, రవికిరణ్, సారంగం, శ్రీకాంత్‌లతో పాటు ఏఈలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు షాకివ్వాలి

- రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత పట్టభద్రులదే..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

7



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన సీపీ

వరంగల్ సిటీ, మే 23: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పని తరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, ఏనుమాముల సీఐ పులి రమేష్ ఉన్నారు.

నిలిచిన ప్రగతి

ఎన్నికల కోడ్‌తో పేరుకుపోయిన ప్రజా సమస్యలు

పెండింగ్‌లో ధరణి దరఖాస్తులు

జూన్ 6 తర్వాతే ప్రజావాణి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హనుమకొండ కలెక్టరేట్, మే 23: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వలన జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వరంగల్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తోపాటు ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో ప్రజల సమస్యలు పేరుకుపోయాయి. లోక్‌సభ ఎన్నికలకు మార్చి 16వ తేదీన ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అప్పటి నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. జిల్లాకు అభివృద్ధి పనుల నిధులు జూన్ 6 తర్వాతే విడుదల అవుతాయి.

పెండింగ్‌లో దరణి దరఖాస్తులు

ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కారమయ్యేందుకు ప్రభుత్వం ఎన్నికల ముందు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే కోడ్ కారణంగా ప్రత్యేక దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లకు తాత్కాలికంగా విశ్రాంతి ఇచ్చి సిబ్బందిని లోక్‌సభ ఎన్నికల విధులకు వాడుకున్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం ధరణిలోని పలు నిబంధలను సవరిస్తున్నారు. గ్రీవెన్స్ ఆన్‌ల్యాండ్ మ్యాటర్స్(జీఎల్‌ఎం) ద్వారా వచ్చిన దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రజావాణి జూన్ 6 తర్వాతే..

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న జూన్ 6వ తేదీ వరకు నిలిపివేశారు. ఈ ప్రజావాణిలో వివిధ సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టరేట్‌లకు విన్నవించేవారు. ఈ కార్యక్రమానికి వస్తే మా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఎంతో ఆశతో వచ్చేవారు. సమస్యలపై కొందరు ప్రజలు కలెక్టరేట్‌కు రోజు వస్తున్నప్పటికీ కలెక్టర్ కలవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మూడు నెలల నుంచి ప్రజావాణి కార్యక్రమం రద్దు కావడంతో వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న ప్రజలు కలెక్టర్‌ను కలవడానికి సోమవారం కాకుండా వేరే రోజు వచ్చినప్పటికీ కలెక్టర్ కలవకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రజావాణి ద్వారా ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించే మంచి అవకాశం కల్పించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల సమస్యలు పరిష్కారం కాలేకపోతున్నాయని కొందరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తనిఖీ నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి బృందం సభ్యులు

నకిలీ కంటి ఆస్పత్రిలో తనిఖీలు

వరంగల్ మెడికల్, మే 23: తెలంగాణ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు వరంగల్ పట్టణంలోని జేపీఎన్‌రోడ్‌లోని డెక్కన్ ఆప్టికల్స్‌లో డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి బృందం గురువారం తనిఖీ లు నిర్వహించింది. ఆప్టోమెట్రిలో డిప్లొ మా చేసిన ఎం.జనార్దన్.. అందులో డాక్టర్లుగా వ్యవహరిస్తూ కంటి చూపు సంబంధించిన పరీక్షలు చేయడంతోపాటు డాక్టర్‌గా ప్రిస్క్రిప్షన్‌పై మందులు, కంటి చుక్కల మందులు రాస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ నివేదికను హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య మండలికి పంపనున్నారు. డిప్లొమా ఆప్టోమెట్రీ చేసినవారు డాక్టర్ కాదని, మందులు రాయకూడదని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ సూచించారు. తనిఖీ బృందంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ హెచ్‌ఆర్‌డీఏ కోశాధికారి డాక్టర్ శివ్వా సృజన్, అనంతుల అన్వేష్ ఉన్నారు.

రోలర్‌లో పడి కార్మికుడి మృతి



మృతిచెందిన మంజునాథ్‌యాదవ్

గీసుగొండ, మే 23: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని గణేషా ఎకోటెక్ కంపెనీలో పీఎస్‌ఎఫ్ రోలర్‌లో పడి మంజునాథ్‌యాదవ్(23) అనే కార్మికుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ పట్టణం రసూల్‌పూర్‌కు చెందిన మంజునాథ్ యేడాదిగా గణేష్ ఎకోటెక్‌కంపెనీలో పీఎస్‌ఎఫ్ రోలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ప్లాస్టిక్ దారాలు రోల్ అవుతున్నప్పుడు ఎక్కడైనా చిక్కులుపడి చుట్టుకుంటే వాటిని సరిచేస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి రోలర్‌లను ఆపరేట్ చేస్తూ చిక్కుపడిన దారాలను కట్ చేస్తుండగా చేయి రోలర్‌లోకి లాక్కోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంజునాథ్‌ను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయాన్ని యాజమాన్యాన్ని వివరణ కోరగా మృతి చెందినది వాస్తవమేనని, మృతుడి కుటుంబీకులకు సమాచారాన్ని అందించినట్లు పేర్కొంది. యూపీ నుంచి వారు రావటానికి ఫ్లైట్ టికెట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపరిచారు. కాగా, బుధవారం ఉదయం కార్మికులను తీసుకువచ్చే మినీబస్ ఢీకొని గణేషా కంపెనీలో పనిచేసే కార్మికుడు ఏనుగల్ గ్రామానికి చెందిన జిలానిపాషకు గాయాలయ్యాయని తెలిపారు. అతడిని కూడా చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. అయితే కంపెనీలో పనిచేసే వారందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, మే 23: దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూరు ప్రాంతంలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. గురువారం నిర్వహించిన దాడిలో రూ.50వేలనగదు, ఐదు మోటార్ సైకిళ్లు, ఏడు స్మార్ట్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐలు రవికుమార్, దయాకర్‌లు ధ్రువీకరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు షాకివ్వాలి

పట్టభద్రులపై రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

జనగామ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా షాకివ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఖమ్మం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో జనగామలో ఆయన కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు బీఆర్ఎస్, ఆరు నెలలుగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీ అమలుపై కూడా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఆగస్టుకు వాయిదా వేశారని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రుణమాఫీ చేయకపోవడంవల్ల బ్యాంకులు కొత్తగా రుణాలను ఇవ్వడం లేదన్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, వాటి డీఎన్ఏ కూడా ఒక్కటేనని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ప్రజలు భావించారని, అయినా ఏ మార్పు రాలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా అయిందని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పీడ విరగడ కావాలని కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆపార్టీ కూడా బీఆర్ఎస్ బాటలోనే పోతోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీతో హామీలు ఇప్పించి ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. దేవుళ్ల పేరు మీద ఒట్లు వేస్తూ ప్రజలను ముంచుతున్నారని మండిపడ్డారు. వడ్లకు బోనస్ ఇస్తానని చెప్పి కేవలం సన్న వడ్లకే అని మాట మార్చడం ఏంటని ప్రశ్నించారు. సన్న, దొడ్డు తేడా లేకుండా అన్ని రకాల వడ్లను కొనడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ బోనస్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి నొప్పి ఏంటని నిలదీశారు. బోనస్ నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నరకాన్ని ప్రోత్సహించాలనుకుంటే అవసరమైతే క్వింటాకు రూ. 1000 బోనస్ ఇవ్వాలని, కానీ ఇచ్చిన మాట ప్రకారం దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు కరవు భత్యాన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు డీఏలను చెల్లించలేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీ పెండింగ్, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ సర్కారుకు పట్టింపు లేకుండా పోయిందని అన్నారు. గత ప్రభుత్వ పథకాలను అమలు చేస్తారా, తొలగిస్తారా అన్న దానిపై స్పష్టత లేదని అన్నారు. ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుంటారన్న దానిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక అవగాహన అంటూ లేదని, ఇలాగే కొనసాగితే రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, సౌడ రమేశ్, మహంకాళి హరిశ్చంద్రగుప్త, శివరాజ్‌యాదవ్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం అభివృద్ధిపై రోజూ సమీక్ష

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఎంజీఎం ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, మే 23: పేదల ఆస్పత్రి ఎంజీఎం అభివృద్ధిపై లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రతీ రోజు ఒక గంట కేటాయిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 'పెద్ద ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు' అనే కథనం గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పందించారు. గురువారం ఉదయం ఎంజీఎంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎంజీఎం పనితీరు మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎంజీఎంలో పరికరాల మరమ్మతు కోసం ఆయా సంస్థ ప్రతినిధులు స్పందించకపోతే పోలీసు కేసు నమోదు చేయాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిపై కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గంటలు కరెంట్ పోతేనే గగ్గోలు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. కేసీఆర్ వరంగల్‌లో మకాం వేసి ఇచ్చిన హామీలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఆ హామీలు నెరవేర్చనందుకే వారిని ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగులు కూడా స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వహిస్తూ నిర్లక్ష్యాన్ని పక్కనపెట్టాలని నాయిని విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు ఎమ్మెల్యే నాయిని ఓపీ బ్లాక్ పరిశీలించి అక్కడ నుంచి రక్తనిధి కేంద్రానికి చేరుకున్నారు. రక్తనిధి కేంద్రంలో మూలనపడ్డ ప్లేట్‌లెట్ సపరేట్ మిషన్ ఎందుకు బాగు చేయడం లేదని ప్రశ్నించారు. మార్చురీలో దుర్గంధం రావడంపై ప్రశ్నించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా అసౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కొన్ని ల్యాబ్ పరీక్షలను బయటికి పంపిస్తున్న దృశ్యాన్ని స్వయంగా గమనించారు. రేడియాలజీ విభాగంలో రెండు ఎక్స్‌రే మిషన్లు పనిచేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్ఎంలు డాక్టర్ మురళి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం అడ్డగోలు హామీలిచ్చి ఆగం చేస్తున్నాడు..

ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్



మీడియాతో మాట్లాడుతున్న అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

హనుమకొండ టౌన్, మే 23: శాసన సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు లక్షల కోట్లు ఖర్చు అయ్యే హామీలిచ్చి సీఎం అయ్యాక అమలుపరచకుండా ప్రజలను రేవంత్‌రెడ్డి ఆగం చేస్తున్నాడని బీజేపీ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన పార్టీ ఒకటైతే.. 10 యేళ్లు అధికారంలో ఉండి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిగజార్చిన పార్టీ మరొకటని దుయ్యబట్టారు. నిరంతరం ప్రజల పక్షాన కొట్లాడే బీజేపీ పార్టీని పట్టభద్రుల ఎన్నికల్లో ఆదరించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ అధికారంలో రాగానే డిసెంబర్ 9న ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని ఘంటాపథంగా చెప్పిన రేవంత్ రెడ్డి.. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏ విధంగా మాట మార్చాడో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రశ్నించే గొంతుకను ఆదరించండని కాంగ్రెస్ అభ్యర్థి చెబుతున్న మాటలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు. అధికార పార్టీ అభ్యర్థి అయి ఉండి ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నిస్తాడని అన్నారు. మా తప్పులను బయటకు తీయకండి.. మీ తప్పులను ఎత్తిచూపం.. అని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాక ఆ పార్టీల అభ్యర్థులను శాసన మండలికి పంపిస్తే సమస్యలపై ఎలా ప్రశ్నిస్తారనేది మేధావులు ఆలోచన చేయాలన్నారు. శాసనసభలో 8మంది బీజేపీ ఎమ్మెల్యేలు అధికార పార్టీని సమస్యలపై ఎలా నిలదీస్తున్నారో.. అదే రీతిలో శాసనమండలిలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ప్రశ్నిస్తారన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, పట్టభద్రులను ఓటు అడిగే నైతిక హక్కు ఆ పార్టీలకు లేదని విమర్శించారు. 10 యేళ్లలో బీఆర్ఎస్ భూములు, మద్యం అమ్ముకొని ఖజానా నింపుకుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పని చేస్తోందని ఎద్దేవా చేశారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ రూ.14,000కోట్ల అప్పు చేసిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంటే.. కాంగ్రెస్ హయాంలో ప్రతీ మంత్రి దోచుకొని దాచుకుంటున్నారన్నారు. దోచుకున్న దాంట్లో కొంత ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు ఉపఎన్నికలు వచ్చాయని, కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ మటుమాయవుతుందని, కాంగ్రెస్ ఓడిపోతుందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అవే ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. పెద్దల సభలో బ్లాక్ మెయిలర్‌కు అవకాశం ఇవ్వొద్దని, నీతి, నిజాయితీతో 40 యేళ్లగా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న ప్రేమేందర్‌రెడ్డిని మేధావులు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మురళీధర్, నరోత్తమ్ రెడ్డి, కొండి జితేందర్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో విద్యుత్ అధికారుల పరిశీలన

ఎంజీఎం ఘటనతో చలనం



ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా గురించి తెలుసుకుంటున్న ఎస్ఈ వెంకటరమణ

హనుమకొండ టౌన్, మే23: ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం నిలిచిపోయిన విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఎన్పీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్న ప్రసూతి ఆస్పత్రులు, పీహెచ్‌సీ కేంద్రాలు, వివిధ ప్రత్యేక విభాగాలను ఏఈ స్థాయి నుంచి ఎస్ఈ స్థాయి అధికారుల వరకు కేటగిరీలుగా విడిపోయి సందర్శించారు. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్, జనరేటర్లను పరిశీలించి వాటి మెయింటెనెన్స్ కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ముందుస్తుగానే తమ దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి అందిన 'ఎంజీఎం' నివేదిక

వరంగల్ మెడికల్, మే 23: ఈనెల 21న వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పడిన విద్యుత్తు అంతరాయంపై ప్రభుత్వం ఆదేశించిన విధంగా నివేదికను అందించినట్లు ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కరెంటు అంతరాయంపై ఎన్పీడీసీఎల్ బృందం లైన్‌లను తనిఖీ చేసిందన్నారు. బ్రేకర్లో లోపం ఉందని, ప్రధాన సబ్‌స్టేషన్‌కు హెచ్‌టీ లైన్ జంపర్‌లు లూజ్ కాంటాక్ట్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఔట్ పేషెంట్ బ్లాక్‌లకు సరఫరా చేసే ఇతర సబ్ స్టేషన్ లైన్‌లలో ఎటువంటి లోపం లేదని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఔట్ పేషెంట్‌లకు సరఫరా చేసే సబ్‌స్టేషన్ లైన్‌లకు సరఫరాను పునరుద్ధరించి ఆపై హెచ్‌టీ లైన్ జంపర్‌లను రిపేర్ చేసి విద్యుత్ సరఫరా అందించారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రిలోని జనరేటర్లపై అత్యవసర ప్రాంతాలైన ఎమర్జెన్సీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ఎంసీహెచ్ వార్డులకు విద్యుత్ సరఫరాను అందించామని తెలిపారు. రోగుల సంరక్షణకు ఎలాంటి అసౌకర్యాల కలగలేదని రామ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మృతుడు భూపాలపల్లి జిల్లా వాసి





ఆత్మహత్య చేసుకున్న బర్ల హరీష్ (20)

రఘునాథపల్లి, మే 23: చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన బర్ల హరీష్ (20) అనే యువకుడు తన తండ్రి బర్ల సదయ్యతో వరి ధాన్యం పట్టించే విషయంలో గొడవ పడి బుధవారం తన మోటారు సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. మోటారు సైకిల్‌పై ఇంటి నుంచి బయలుదేరిన హరీష్ తండ్రితో జరిగిన గొడవతో మనస్తాపానికి గురై మండలంలోని గోవర్ధనగిరి గ్రామ శివారులోని దొంతుల సమ్మయ్య వ్యవసాయ భూమి వద్ద ఉన్న చింత చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్థులు గురువారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఇతర ఆధారాలతో భూపాలపల్లి జిల్లా వాసిగా గుర్తించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలో ఉన్న మోటారు సైకిల్‌లో ఒక బీరు బాటిల్‌తో పాటు రెండు రకాల పురుగుల మందు డబ్బాలు ఉన్నాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

జనగామ కల్చరల్, మే 23: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కాజీపేటకు చెందిన రౌతు దయాకర్ (47) కాజీపేట లోకోషెడ్‌లో డీజిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తాగుడుకు బానిసై, మానసిక వేదనతో గురువారం జనగామ రైల్వేస్టేషన్‌లో ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తు తీసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జనగామ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి, కానిస్టేబుల్ సీహెచ్.నరేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఐటీ'లో ఇష్టారాజ్యం



బల్దియాలో ఐటీ విభాగం కార్యాలయం

- ఔట్‌సోర్సింగ్ గుప్పిట్లో బల్దియా సాంకేతిక విభాగం
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే కార్పొరేషన్ డాటా
- కార్పొరేషన్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

వరంగల్ కార్పొరేషన్, మే 23: వరంగల్ నగర పాలక సంస్థ సాంకేతిక విభాగాన్ని బల్దియా ఉన్నతాధికారులు గాలికి వదిలేసినట్టు తెలుస్తోంది. ఐటీ విభాగంతో పాటు దానికి అనుబంధంగా పనిచేస్తున్న ఈ- సేవా కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన పన్నులు, పథకాలు, నిర్మాణాలు, సిబ్బంది పూర్తి వివరాలు, లెక్కలు, బిల్లులు, రాబడి, పోబడి అంతా ఐటీ విభాగంలో నిక్షిప్తమై ఉంటుంది. అయితే చాలా కాలంగా కార్పొరేషన్ ఐటీ విభాగానికి ప్రభుత్వ అధికారి పర్యవేక్షణ బాధ్యత లేకుండాపోయింది. బల్దియా శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, మలేరియా, హార్టికల్చర్, వెటర్నరీ విభాగాలను అధికారులు సమర్థవంతంగా నడిపిస్తున్నారు. కానీ బల్దియా ఐటీ విభాగాన్ని మాత్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో అక్కడి సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడుస్తోంది. ఉదయం వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసుకున్న తర్వాత కంటికి కనిపించకుండా పోతారనే ప్రచారం ఉంది.

ఇష్టారాజ్యం

నగర పాలక సంస్థ ఐటీ విభాగంలో 14 యేళ్లుగా ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజ్యమేలుతున్నారు. ఈ శాఖలోకి మరే ప్రభుత్వ అధికారి చొరబడకుండా గత కమిషనర్, మేయర్‌లను తప్పుతోవ పట్టించి ఐటీ శాఖను గుప్పిట్లో పెట్టుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక్కడ సిబ్బందిని తొలగించాలన్నా, నియమించుకోవాలన్నా ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతుల్లో ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా కార్పొరేషన్ పరిధిలో కంప్యూటర్‌లకు సంబంధించిన పరికరాలు కొనుగోలు చేయాలన్నా.. ఆయన కనుసన్నల్లోనే ఉంటుందని సమాచారం. ఈ క్రమంలో నాసిరకం సామగ్రి కొనుగోలు చేసి నకిలీ బిల్లులు సృష్టిస్తున్నట్లు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ శాఖపై ఔట్ సోర్సింగ్ వ్యక్తి పెత్తనం సాగుతుండడంతో అలాగే బల్దియాలో డాటా సైబర్ నేరస్తుల చేతికి వెళ్లడంతో పాటు అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. ఇంకా కార్పొరేషన్‌కు సంబంధించిన పూర్తి డాటాను ఓ వ్యక్తి బయటి వ్యక్తులకు, సైబర్ నేరగాళ్లకు చేరవేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్న హైదరాబాద్ ఐటీ అధికారులు.. వరంగల్ బల్దియా డాటా, పాస్‌వర్డ్‌ను వారి వద్ద భద్రపరిచినట్టు సమాచారం.

కమిషనర్ దృష్టి సారించాలి..

నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కొనసాగుతున్న ఐటీ విభాగాన్ని పర్యవేక్షించేందుకు, అక్కడ పని చేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నడిపించేందుకు ఓ ప్రభుత్వ ఉన్నతాధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. బల్దియా ఐటీ విభాగం అదుపు తప్పకుండా ఉండాలంటే ఉన్న ఉద్యోగులపై ఒక ప్రభుత్వ పర్యవేక్షణ అధికారి ఉండాలని కొందరు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. కనీసం సూపరింటెండెంట్ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉన్నా.. ఇక్కడ జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కమిషనర్ దృష్టి సారించాలని నగర పౌరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్డదారిలో నియామకాలు

గ్రేటర్ నగర పాలక సంస్థలో గతంలో ముగ్గురు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐటీ విధులు నిర్వర్తించే వారు. కానీ 2020లో అప్పటి పాలక వర్గంలో ఓ నేత కొందరు వ్యక్తులను చేరదీసి కంప్యూటర్ శిక్షణ ఇప్పించాడు. 8 మంది నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకోవడంతో పాటు ఇన్సూరెన్స్ పేరుతో మరికొంత డబ్బు తీసుకుని ఐటీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పెట్టించాడని తెలిసింది. ఇంకా శానిటేషన్ విభాగంలో పీహెచ్ (ఫిజికల్ హెల్త్) వర్కర్ల కొరత ఉందని 452 మందిని అడ్డదారిలో చేర్చుకున్నారు. వారిలో కొందరు శానిటేషన్ పనులు చేపట్టకుండా ఐటీతో పాటు ఈ-సేవా కేంద్రాల్లో ఆపరేటర్లుగా, బిల్ కలెక్టర్లుగా పని చేస్తూ పని తప్పించుకుంటున్నారు. దీంతో శానిటేషన్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. అయితే ఈ-సేవల్లో పని చేసే సిబ్బందికి నెలకు వచ్చే జీతాలతో పాటు ట్యాక్సీలు చెల్లించడానికి వచ్చిన వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు ప్రజలు వెల్లడించారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలను ప్రోత్సహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలను ప్రోత్సహించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కేయూలోని కమిటీ హాల్‌లో కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్‌రాజుతో పాటు బోధన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగానే కొత్తగూడెం కళాశాలను మొదటి ప్రాధాన్యత క్రమంలో మొదటి ఎంపికగా ఉండే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ ఇతరత్ర వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం. సదానందం, డీన్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్ హనుమంతు, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకులు ప్రొఫెసర్ ఎస్. నర్సింహచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు మహ్మద్ హబీబుద్దీన్, డాక్టర్ కోల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూలో మెస్ మూసివేయొద్దని పీడీఎస్‌యూ విద్యార్థుల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ యూనివర్సిటీలోని మెస్సులను మూసివేయాలని హాస్టల్స్ డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆందోళనకు దిగింది. గురువారం కేయూలోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భగా సంఘం వర్సిటీ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ... త్వరలో గ్రూప్స్, డీఎస్సీతో పాటు అనేక రకాలైన పోటీ పరీక్షలు జరుగున్న నేపథ్యంలో హాస్టళ్లను మూసివేస్తాననడం తగదన్నారు. మెస్‌ను మూసివేస్తామన్న సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పరిపాలన భవనాన్ని ముట్టడించి రిజిస్ట్రార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చిన హాస్టల్స్ డైరెక్టర్ సమ్మయ్య హాస్టల్స్‌ని మూసివేయమని హామి ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వినయ్, రాజు, శ్రవణ్, అర్జున్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్‌లో సంజీవ్‌కు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధకుడు ఎన్.సంజీవ్‌కు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మహ్మద్ ముస్తాఫా గురువారం డాక్టరేట్‌ను ప్రకటించారు. ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా - ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్' అనే పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను నవీన్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు.

జయప్రకాశ్ క్రికెట్ ట్రోఫీ విజేత జనగామ



విజేత జనగామ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, మే 23: మూడురోజులుగా ఎల్‌బీ కాలేజీలో నిర్వహిస్తున్న జయప్రకాశ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటులో గురువారం జరిగిన జనగామ వర్సెస్ ములుగు జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో 79 పరుగులతో జనగామ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ క్రికెట్ పోటీల్లో ఫైనల్‌లో జరిగిన జనగామ, ములుగు మధ్య జరిగిన ఫైనల్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జనగామ జట్టు నిర్ణీత 20 ఓటర్లకు గాను 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. జనగామ జట్టు ఓపెనర్ ప్రదీప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కేవలం 42 బంతులు ఎదుర్కొని ఒక సిక్స్, 9 బౌండరీల సాయంతో 58 పరుగులు జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. తదుపరి బరిలోకి దిగిన ములుగు జిల్లా జట్టు 20 ఓవర్లు ఎదుర్కొని 10 వికెట్ల నష్టానికి 126 పరుగులు మాత్రమే చేసి 79 పరుగుల తేడాతో ఓటమి పాలయింది.

కాగా, జనగామ జిల్లా జట్టు బౌలర్ అనురీత్ నాలుగు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపిక అయ్యాడు. మూడు రోజులు నాకౌట్ పద్ధతిలో జరగుతున్న క్రీడా పోటీలో క్రీడాకారులు నువ్వా నేనా అన్న తీరుగా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇక్కడ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 24 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్ జిల్లాస్థాయి బాలుర టీ 20 సీనియర్స్ క్రికెట్ విభాగంలో పాల్గొననున్న క్రీడాకారులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

నకిలీ విత్తన విక్రయాలను అరికట్టాలి

వరంగల్ కలెక్టరేట్, మే 23: నకిలీ విత్తన విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కలెక్టర్ ప్రావీణ్యకు తెలంగాణ రైతుకూలీ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఈర్లపైడి మాట్లాడుతూ పత్తి విత్తనాలను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించి అధిక విక్రయిస్తున్న సీడ్స్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు బొర్ర ఆనంద్, భూమా అశోక్, ఎలకంటి కుమారస్వామి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌నగర్‌లో అన్నీ సమస్యలే..

● తాగునీటికి తండ్లాట ● అస్తవ్యస్తంగా శ్మశాన వాటిక ● డ్రెయినేజీల్లో ఏపుగా పెరిగిన మొక్కలు

మిల్స్ కాలనీ, మే 23: వరంగల్ గ్రేటర్ మున్సిపాలిటీ పరిధి 36వ డివిజన్ చింతల్‌లోని ఆర్‌ఎస్ నగర్‌లో అన్నీ సమస్యలే తాండవిస్తున్నాయి. వేసవి కావడంతో తాగు నీటిని అక్కడి ప్రజలు తండ్లాడాల్సి వస్తోంది. పారిశుధ్య అంతంత మాత్రంగానే ఉంది. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి కంపు కొడుతోంది. శ్మశాన వాటిక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతూనే ఉంది. కోట అగర్తల పక్కనే గుడిసెలు ఉండటంతో వర్షం పడితే కాలువ పొంగిపొర్లుతూ ఇండ్లలోని నీరు చేరుతోంది. ఆర్‌ఎస్ నగర్‌కు ఆనుకొని ఉన్న అగర్తల కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అస్తవ్యస్తంగా తయారైంది.

తాగు నీటికి తండ్లాట..

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా లేక పోవడంతో ఇక్కడి ప్రజలు తాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఉన్నా తాగునీటి కోసం మున్సిపాలిటీ ట్యాంకర్ల మీదనే ఇక్కడి వారు ఆధారపడుతున్నారు. పుప్పాలగుట్టలో కొత్తగా నిర్మాణం చేసిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో నీరు లేక పోవడంతో ఆరెస్ నగర్‌లోని నల్లాల్లోకి తాగునీరు రావడం లేదు.

అస్తవ్యస్తంగా శ్మశాన వాటిక...

ఆర్‌ఎస్‌నగర్‌లోని శ్మశాన వాటిక వసతులు లేక అస్తవ్యస్తంగా మారిపోయింది. శ్మశాన వాటికలో నీటి వసతి లేదు. బోర్ మరమ్మతుకు గురైనా పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. దీంతో అంతిమ సంస్కారాల అనంతరం స్నానాలకు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు శ్మశాన వాటిక ప్రాంగణంలో ఏర్పాటు చేసినా గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. శ్మశాన వాటిక ప్రహరి ఎత్తుగా లేకపోవడంతో దహనసంస్కారాలు జరుగుతున్నప్పుడు పొగ మొత్తం పక్కనున్న ఇళ్లల్లో వెళ్తోంది. బర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై పొగ గొట్టాలు శిథిలమయ్యాయి. పిచ్చి మొక్కలు పెరిగి అంతిమ సంస్కారాలకు అడ్డంకిగా మారుతున్నాయి.

పారిశుధ్య సమస్యలు..

ఆర్‌ఎస్ నగర్‌లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా మునిసిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో డ్రెయినేజీలు నిండి రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. అగర్తల కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి నాలా మొత్తం మూసుకుపోయింది. వానాకాలం ముందుండటంతో వరదలువస్తే పక్కనే ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరుతుందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాలు చెత్తకుప్పలుగా మారుతున్నాయి.



కాలువలో పేరుకుపోయిన చెత్త



శ్మశాన వాటికలో నిరుపయోగంగా ఉన్న మహిళల స్నానాల గదులు

తాగునీటి వసతి కల్పించాలి..



ఆర్‌ఎస్ నగరలో తాగు నీటికి ఇబ్బందులు బాగా ఉన్నాయి. మిషన్ భగీరథ నల్లాలు ఉన్నప్పటికీ నీళ్లు రావడం లేదు. బోర్ నీళ్లు, మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్ నీటిపైనే ఆధారపడుతున్నాం. ఎండాకాలం కావడంతో తాగు నీటికి, ఇతరత్ర అవసరాలకు ఇబ్బందులు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలి. - బొల్ల యాదగిరి, స్థానికుడు

శ్మశాన వాటికలో వసతులు ఏర్పాటు చేయాలి..



శ్మశాన వాటికలో కనీస వసతులు కరువయ్యాయి. నీటి వసతి లేకపోవడంతో దహన సంస్కారాల అనంతరం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మహిళలకు స్నానాల గదులు లేవు. ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో పక్కనున్న ఇండ్లలోకి దహన సంస్కారాల పొగంతా వస్తోంది. - రాజారపు అనిల్, స్థానికుడు

వైభవంగా వైశాఖ పౌర్ణమి వేడుకలు

జ్ఞాన సరస్వతి దేవికి శ్రీచక్రార్చన పూజలు

వరంగల్ కల్చరల్, మే 23: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం నగరంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. భద్రకాళి రోడ్డులోని శ్రీజ్ఞాన సరస్వతి దేవి పీఠంలో ప్రతీ పౌర్ణమికి సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని శ్రీచక్రానికి పంచ గంధములు, పంచామృతాలతో అర్చకులు పవన్ శర్మ అభిషేకం నిర్వహించారు. అనంతరం సుహాసినిలతో సామూహికంగా శ్రీలలిత సహస్రనామ పారాయణంతో కుంకుమ పూజ నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి పూజాలంకరణ చేశారు. దత్తక్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి అభిషేకం, హోమం, పూర్ణాహుతిని నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, శృంగేరి శంకర మఠం, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయం, శ్రీసంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

బొడ్రాయి నిర్వహణ కమిటీ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన బొడ్రాయి కార్యవర్గం సభ్యులు

కరీమాబాద్, మే 23: కరీమాబాద్ నానామియతోటలో బొడ్రాయి నిర్వహణ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నానామియతోటలో ఇటీవలే బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించగా, తదుపరి వార్షికోత్సవ నిర్వహణకు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దయ్యాల సుధాకర్, ఉపాధ్యక్షులుగా దూడ కొమురెల్లి, చెట్టి మోహన్, వాసూరి శ్రీనివాస్, కొండిల్ల కనుకయ్య, చింతపట్ల వేణు, ప్రధాన కార్యదర్శిగా కంకల శంకర్, సహాయ కార్యదర్శులుగా మేడిపల్లి రాజు, చిలువేరు శ్రీనివాస్, కోశాధికారిగా గోరంటల కిషన్, సహాయ కోశాధికారిగా కొండిల్ల రవీందర్, ఆర్గనైజర్స్‌గా చీర రమేష్, గొట్టె మల్లేశం, మండల అజయ్, చింతపట్ల ప్రశాంత్, న్యాలపోగుల చందు, కార్యవర్గ సభ్యులుగా కళ్లపెల్లి యాదగిరి, లింగమూర్తి, కుమార్, కిషన్, శ్రీనివాస్, కుమారస్వామి, ప్రశాంత్, రాజేష్, రమేష్, ముఖ్య సలహాదారులుగా మల్లేశం, క్రిష్ణ, పోతరవేణి రాజన్న, వీరస్వామి, ఆడెపు దేవేందర్ తదితరులు ఎన్నికయ్యారు.

'మాజీ వీసీకి వంతపాడుతున్న రిజిస్ట్రార్'

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: కాకతీయ విశ్వవిద్యాలయంలోని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాజీ వీసీ రమేష్‌కు వంత పాడుతున్నారని అకుట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫైళ్ల మాయంపై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. లాడ్జీ నుంచి మాజీ వీసీ ఫైళ్లు తీసుకెళుతున్న సీసీ ఫుటేజీని బహిర్గతం చేయడంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి చేస్తున్న జ్యాప్యాన్ని ఆయన తప్పుబట్టారు.

ఫైళ్లు మాయమైన ఘటనలో రిజిస్ట్రార్ పాత్రపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఫైళ్ల మాయం విషయం, సీసీ ఫుటేజీని బయటపెట్టకపోవ డం తదితర అంశాలను పరిశీలిస్తే రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయని ఆయన ఆరోపణలు చేశారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

కరీంనగర్ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ హరిశంకర్

కరీమాబాద్, మే 23: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కరీంనగర్ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ హరిశంకర్ అన్నారు. గురువారం నగరంలోని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో కరీమాబాద్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, నాయకులు కోరె కృష్ణ, మరుపల్ల గౌతం, కళ్యాణపు వెంకటేశ్వర్లు పోలేపాక రాజన్‌బాబు, సాదుల రంజిత్, గజ్జి సాంబయ్య, మధు, ఫరీద్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ కోరారు. గురువారం ఖిలావరంగల్ తూర్పుకోటలోని ముదిరాజ్, ఎస్సీ, ఎస్టీ, యాదవ, పెరక, గడ్డమీది ప్రాంతాలలో కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంగరబోయిన విజయ్, ఇంచార్జిలు సుధాకర్, అజిత్, శరత్ నాయకులు ఉమేష్, ధర్మరాజు, అరు ణ్, శ్రీధర్ రెడ్డి, అమర్‌వర్మ, ప్రభాకర్, రాజన్ పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న కరీంనగర్ డిప్యూటీ మేయర్ హరిశంకర్

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువత

ఖిలావరంగల్, మే 23: అత్యవసర స్థితిలో ఉన్న వారితో పాటు, ప్రాణపాయ పరిస్థితిలో ఉన్న వారిని రక్తదానంతో కాపాడవచ్చని చింతల్ వాకింగ్ గ్రౌండ్ ఇంచార్జి రావుల రాజేష్ అన్నారు. గురువారం ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ హనుమకొండ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈమేరకు 36మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మదన్‌మోహన్‌రావు, రక్తదాన మోటివేటర్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ కృషి, ఆర్ సీ జి.పద్మజారావు, అధ్యక్షుడు ఎం.రాజేందర్ ప్రధానకార్యదర్శి ఎం. సురేందర్‌రావు పాల్గొన్నారు.

'అనుమతిలేని కళాశాలను మూసివేయాలి'



డీఐఈవో మాధవరావుకు ఫిర్యాదు చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: వరంగల్ పోచమ్మమైదాన్ వేణురావు కాలనీలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఏకశిల జూనియర్ కళాశాలను మూసివేయాలని ఏఐఎస్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మోహన్, ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో కె.మాధవరావుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కాలేజ్‌ను నిర్వహిస్తూ అక్రమంగా ప్రవేశాలు చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. అనుమతి లేని కళాశాలను సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసును నమోదు చేయించాలని డీఐఈవోను డిమాండ్ చేశామన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



మాట్లాడుతున్న మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు

ఖిలావరంగల్, మే 23: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పోపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు శామంతుల శ్రీనివాస్ అన్నారు. గురువారం శివనగర్‌లో డివిజన్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న)కు మద్దతుగా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల సతీష్, విజయరాంచందర్, శామంతుల కిరణ్, మంద రాజు, కృష్ణవేణి, సం తోషిణి, రాధిక, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే, మల్లన్నకు మద్దతుగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, 139వ, బూత్ ఇంచార్జి సందెల లాజర్ క్రిస్టియన్‌కాలనీలో ఇంటింటి చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వస్కుల బాబు, సీనియర్ నాయకులు జన్ను వివేక్, మారుపట్ల సాయికుమార్, గిరిగిరి పుష్ప, బైరపాక డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల మద్దతు..

మట్టెవాడ: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)కు ఆర్యవైశ్యులు మద్దతు ఇస్తున్నట్టు మాజీ మేయర్, వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు అన్నారు. గురువారం వరంగల్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో మల్లన్నకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, కాంగ్రెస్ నాయకులు రాజనాల శ్రీహరి, మల్యాల వీరమల్లయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు వృద్ధుడి అప్పగింత



మనోహర్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

గిర్మాజిపేట, మే 23 : వృద్ధాప్యం కారణంగా జ్ఞాపకశక్తి కోల్పోయి ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయి వరంగల్ రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన పార్సీ మనోహర్ (86)ను వరంగల్ ఆర్‌పీఎఫ్ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించింది. వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ టిఎస్‌ఆర్ కృష్ణ గురువారం విలేఖరులతో మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.సారయ్య ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ బృందం విధి నిర్వహణలో భాగంగా తనిఖీలు చేపట్టగా మొదటి ప్లాట్‌ఫాంపై వృద్ధుడిని గుర్తించినట్టు పేర్కొన్నారు. అనంతరం వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులు సమాచామిచ్చామన్నారు. పార్సి మనోహర్ అని, జగద్గిరి గుట్టకు చెందిన తన ఇంటి నెంబర్, కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్లను ఆర్‌పీఎఫ్ సిబ్బందికి వృద్ధుడు వివరించారని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు అతడిని అప్పగించినట్టు వెల్లడించారు.

రథశాలలో ప్రైవేట్ కారు

స్వామివారి పంచలోహ వాహనాలు రోడ్డుపైనే..

గిర్మాజిపేట, మే 23 : అధికారుల నిర్లక్ష్యంతో స్వామివారికి అపచారం జరుగుతోంది. శ్రీగోవిందరాజస్వామికి అపచారం జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. శ్రీగోవిందరాజస్వామివారి రథంతో సహా స్వామి వారి పంచలోహ వాహనాలన్నీ రోడ్డుపై చెట్టునీడలో ఉంచారని ఆగ్రహిస్తున్నారు. ఏటా ఏప్రిల్‌లో నెల రోజుల పాటు శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఉత్సవాలలో ప్రధానమైనది రథోత్సవం. రథయాత్ర ముగిశాక రథశాలలో భద్రపరుస్తారు. తిరిగి మరుసటి ఏడాది రథోత్సవానికి రథంను సిద్ధం చేస్తారు. అయితే రథశాలలో స్థానికులు కొందరు తమ కార్ల పార్కింగ్‌కు వాడుకుంటున్నారు. దీంతో రథశాలకు ఎదురుగా పెద్ద రావి చెట్టు నీడలో రథం ఎండకు ఎండుతూ వానకు తడుస్తోందని భక్తులు వాపోతున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసి నెల రోజులైనా రథం రథశాలలో పెట్టడం లేదు. బ్రహ్మోత్సవాల ముగింపు రోజు ఉత్సవ మూర్తుల విగ్రహాలను తీసి ఆలయలో భద్రపరిచిన దేవాలయ ఈఓ, అర్చకులు స్వామివారి పంచలోహ గరుడ,హంసా, అశ్వ ఏనుగు వాహనాలను మాత్రం నిర్లక్ష్యంగానే రథంపై వదిలిపెట్టడంపై భక్తులు మండిపడుతున్నారు. ఇంత అపచారం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు. కనీసం దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డుపైనే గోవిందరాజస్వామి రథం



రథశాలలో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల కారు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చెన్నారావుపేట, మే 23 : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకు న్న సంఘటన మండలంలోని ముగ్ధుంపురంలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన తోట సమ్మక్క- భిక్షపతిల కుమారుడు తోట రాజు(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. 18 సంవత్సరాల క్రితం నర్సంపేట మండలం రాజపల్లెకి చెందిన రాణితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. 10 సంవత్సరాల క్రితం భార్య భర్తల మధ్య గొడవలు కావటంతో భార్య రాణి తన పిల్లలను తీసుకొని హైదరబాద్‌కు జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఒంటరిగా ఉంటున్న రాజు మద్యానికి బానిసయ్యాడు. తన భార్య, పిల్లలు తిరిగి ఇంటికి వస్తారో రారోనని తీవ్ర మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి వెంటనే నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

డీటీడీవో అవినీతిపై విచారణ చేపట్టాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 23: హనుమకొండ, జనగామ జిల్లాల డీటీడీవో ప్రేమకళ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రంజిత్ మాట్లాడుతూ... మూడేళ్లుగా గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టు పటించిందని ఆరోపించారు. అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తూ మధ్యవర్తుల ద్వారా డబ్బులు దండుకుంటోందని విమర్శించారు. రెండు జిల్లాల్లో పనిచేస్తున్న ఒక్కో వార్డెన్‌కు రెండు మూడు హాస్టళ్ల ఇన్‌చార్జి బాధ్యతను అప్పగిస్తూ వారి నుంచి డైట్ బిల్లుల్లో నుంచి 20 శాతం తీసుకుంటోందని ఆరోపించారు.

పిల్లల హాజరు శాతం 100శాతం చూపించుకోండని లక్షల రూపాయలు సంపాదిస్తున్న ఆమెపై ఏసీబీ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆమె అక్రమాలపై విచారణ చేపట్టకపోతే టీజీవీపీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్వర్, సాకి, రాజేష్, ఠాగూర్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



గంగదేవిపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

గీసుగొండ, మే 23 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి గాలివాన బీభత్సవం సృషించింది. ఒక్కసారిగా వచ్చిన బలమైన గాలులతో రోడ్ల వెంట ఉన్న పెద్దచెట్లు కూలీ రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఊకల్- గంగదేవిపల్లి మార్గమధ్యలో వరంగల్- నర్సంపేట రోడ్డుపై భారీ వృక్షం పడిపోవటంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. మునగ, అరటి, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఆరబోసిన వరిధాన్యం, మొక్కలు తడిసిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

దుగ్గొండి: మండలంలో బుధవారం రాత్రి వచ్చిన గాలి దూమారం, భారీవర్షంతో విద్యుత్ స్తంభా లు, చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని నాచినపల్లిలో మూడు విద్యుత్ స్తంభాలు, తిమ్మంపేటలో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, విద్యుత్ సిబ్బంది విరిగిన చెట్లు, స్తంభాలను గురువారం తొలగించి మళ్లీ విద్యుత్‌ను సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నామని ఏఈ ప్రత్యూష వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 24 మే 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులతో జిల్లా క్రీడల అధికారి

దుగ్గొండి, మే 23 : క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్, క్రీడా అధికారి సత్యవాణి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శవాణి పాఠశాలలో వేసవి కాలం రెజ్లింగ్ క్రీడా శిక్షణ శిబిరం జరుగుతుండగా గురువారం సత్యవాణి సందర్శించి క్రీడాకారులతో మాట్లాడాతూ శిక్షణలో క్రీడల మెలకువలు తెలుసుకొని పాటించాల న్నారు. సమయం వృథా చేయకుండా క్రీడాకారులు శిక్షణలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి, ప్రిన్సిపాల్ సుధాకర్, కోచ్ ఇటికాల దేవేందర్, ఏవో రమేశ్‌లు పాల్గొన్నారు.

ఖోఖో శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన డీవైఎస్‌వో



క్రీడాకారులతో మాట్లాడుతున్న సత్యవాణి

గీసుగొండ, మే 23 : గీసుగొండ జెడ్పీ పాఠశాలలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న ఖోఖో వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యూత్ స్పోర్ట్స్ అధికారి (డీవైఎస్‌వో) సత్య వాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల శిక్షణ శిబిరాలను గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జి కోట రాంబాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

ఖానాపురం, మే 23 : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు రావుల వెంకన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, ఆయనతో కలిసి 1991-92లో పదో తరగతి చదివిన మిత్ర బృందం రూ.ఒక లక్ష ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేసి, పరామర్శించారు. మిత్రులు కట్లోజు వెంకటనారాయణ చారి, కోరె సుధాకర్, మల్యాల మధుకర్, కోడాటి రవీందర్, విక్కీ, గిరిబాబు, ఆలూరి ప్రసాద్‌రెడ్డి, బండి వెంకటనారాయణ, లద్దునూరి కోటయ్య, నారగోని రమేష్, సాంబయ్య, నరసింహాచారి, ఐలయ్య తదితరులు ఉన్నారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అక్కల్‌చెడలో పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్

చెన్నారావుపేట, మే 23 : మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో గత కొన్ని నెలలుగా వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులో ఉన్న ఒంటరి మల్లయ్య వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గత నాలుగు నెలల నుంచి విద్యుత్ సరాఫరా కావటం లేదు.

దీంతో చుట్టు పక్కల వ్యవసాయ బావులకు విద్యుత్‌లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ విషయంపై సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవటంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పంట మార్పిడితో భూసారం

ఒకే పంటను వేస్తే తగ్గనున్న దిగుబడి

రాయపర్తి, మే 23 : రైతులు పంట మార్పిడి చేయక పోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గుతోంది. ఒకే పంటను ఒకే భూమిలో ఏళ్ల తరబడి సాగు చేస్తే సమస్యలు ఎదురవుతాయి. చీడపీడల తాకిడి అధికమవుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి చేయడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. నేల భౌతిక స్థితి మెరుగు పడడంతో పాటు, భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పేసి పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బొబ్బెర, పెసర, మినుము వంటి



పంటలను వేసుకోవడం వలన నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీని వలన కలుపు మొక్కలను నివారించవచ్చు. వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు. పత్తి సాగుచేసిన నేలలో మినుము, పెసర వంటివి వేయడంమంచిదని పేర్కొంటున్నారు. వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలువేసేలని అధికారులు పేర్కొంటున్నారు.

రైతులు పాటించాల్సినవి...

ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలని అధికారులు చెబుతున్నారు. తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలని, వర్షాకాలం రోజులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కంది, నువ్వులు, వేరుశనగ వంటి పంటలను వేసుకోవాలని సూచిస్తున్నారు. పంట మార్పిడి చేసే సమయాల్లో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలని, లేదంటే చీడపీడల ఉధృతి ఎక్కువవుతుందని పేర్కొంటున్నారు. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదని, ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయిన జొన్న వేసిన పొలాల్లో మిరప వద్దని, పసుపు తర్వాత మిరప, టమాట, క్యాబేజీ, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకు ముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయా చిక్కుడు చెబుతున్నారు.

ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి...



వీరభద్రం, ఏవో రాయపర్తి

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటలను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాల్ని ఎక్కువగా గ్రహిస్తూ ఉంటాయి. కాబట్టి పోషకాలు ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలను గ్రహించి సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి.

నూతన కార్యాలయంలోకి మునిసిపాలిటీ సేవలు

ఎట్టకేలకు తరలించిన అధికారులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్నీ తరలిస్తారా?

వర్ధన్నపేట రూరల్, మే 23 : ఎట్టకేలకు నూతన కార్యాలయంలో మునిసిపాలిటీ సేవలు గురువారం మారాయి. పాత పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న మునిసిపాలిటీ కార్యాలయం నుండి ఎంపీడీవో ఆవరణ(బ్లాక్ ఆఫీసు)లోకి మునిసిపల్ సిబ్బంది ఆఫీసు ఫర్నిచర్, ఇతర సామాగ్రిలను తరలించారు. కార్యాలయాన్ని ప్రారంభించినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వక పోవడంతో చాలా రోజుల పాటు ఆఫీసు తరలింపులో జాప్యం జరిగింది. ఇక విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో అధికారులు ప్రజలకు అక్కడి నుండి సేవలు



వర్ధన్నపేట నూతన మునిసిపాలిటీ కార్యాలయం

అందించనున్నారు.

పాత కార్యాలయ కేటాయింపు పై ఉత్కంఠ

వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిసమీపంలో ఉన్న మునిసిపల్ పాత కార్యాలయం ఏ ఆఫీసుకు కేటాయిస్తారనే దానిపై ఇప్పుడు ఉత్కంఠ కలుగుతోంది. ఇప్పటికే వర్ధన్నపేట పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, ఎక్సైజ్ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఎక్సైజ్ కార్యాలయ భవనాన్ని నిర్మించి మధ్యలోనే వదిలేసినప్పటికీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి ఇప్పటికే వరకు అధికారులు కసరత్తు చేయలేదు. దీంతో స్థానిక ప్రజ లు సైతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పాత మునిసిపల్ ఆఫీసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది.

రాత్రి వర్షం.. పగలు ఎండ!



ఇల్లంద మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం

వర్ధన్నపేట రూరల్, మే 23 : గత కొన్ని రోజులుగా అన్నదాతలను అకాల వర్షాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పగలంతా ఎండకొట్టి, సాయంకాలం కాగానే వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో పాటు ఈదురు గాలులు, వర్షం కురుస్తోంది. బుధవారం రాత్రి మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోకి తెచ్చిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక ఉదయం తిరిగి మళ్లీ ఎండ కొడుతుండడంతో రాత్రి తడిసిన ధాన్యాన్ని కేంద్రంలోనే ఉండి ఎండబెట్టుకుంటున్నారు. ఇలా కొన్ని రోజులుగా రాత్రి వర్షానికి తడవడం, పగలు తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టడం రైతులకు పనిగా మారిపోయింది. దీంతో ధాన్యం మ్యాచర్ రాక కేంద్రాల్లోనే ఉండిపోతోంది.

గాలివాన బీభత్సం




గంగదేవిపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

గీసుగొండ, మే 23 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృషించింది. ఒక్కసారిగా వచ్చిన బలమైన గాలులతో రోడ్ల వెంట ఉన్న పెద్దచెట్లు కూలీ రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఊకల్- గంగదేవిపల్లి మార్గమధ్యలో వరంగల్- నర్సంపేట రోడ్డుపై భారీ వృక్షం పడిపోవటంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. మునగ, అరటి, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఆరబోసిన వరిధాన్యం, మొక్కలు తడిసిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గాలి దుమారంతో విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

దుగ్గొండి : మండలంలో బుధవారం రాత్రి వచ్చిన గాలి దూమారం, భారీవర్షంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని నాచినపల్లిలో మూడు విద్యుత్ స్తంభాలు, తిమ్మంపేటలో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, విద్యుత్ సిబ్బంది విరిగిన చెట్లు, స్తంభాలను గురువారం తొలగించి మళ్లీ విద్యుత్‌ను సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నామని ఏఈ ప్రత్యూష వెల్లడించారు.

‘రాకేష్‌రెడ్డిని శాసన మండలికి పంపించాలి’



నర్సంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రవీందర్

నర్సంపేట, మే 23 : రైతు కుటుంబంలో పుట్టి ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వచ్చిన విద్యావంతుడు, గోల్డ్‌మెడలిస్టు ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసన మండలికి పంపించాలని పట్టభద్రులను ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రవీందర్ కోరారు. పట్టణంలోని రాయిడి రవీందర్‌రెడ్డి గృహంలో గురువారం రైతు సమన్వయ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు రాయిడి రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల పట్టణ ఇంచార్జి గోనె యువరాజ్, యూత్ అధ్యక్షుడు రాయిడిదుశ్యంత్‌రెడ్డితో కలిసి ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రవీందర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బ్లాక్ మెయిలర్ తీన్మార్ మల్లన్న ఓడించి, అవినీతి మరకలేని విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ బాధ్యులు, వార్డు అధ్యక్షులు బండి రమేశ్, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, నాగిశెట్టి ప్రసాద్, మండల శ్రీనివాస్, భీరంనాగిరెడ్డి, దేవోజు హేమంత్, నాయిని వేణు, పోతరాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : నిరుద్యోగులను, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం బుధరావుపేటలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రవీందర్‌రావుతో కలిసి పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఉన్నత విద్యావంతుడైన, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. శాసన మండలిలో ఉద్యోగుల సమస్యలను, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే దమ్మున్న రాకేష్‌రెడ్డి లాంటి నాయకుడినే గెలిపించాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జి డాక్టర్ ఎస్‌కే మస్తాన్, వేల్పుల లింగయ్య, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వెంకటనర్సయ్య, మౌలాన, మాజీ సర్పంచ్‌లు కాన ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని నర్సంపేట నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ రవీందర్‌రావు కోరారు. గురువారం నెక్కొండలో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సంగని సూరయ్య, భిక్షపతి, నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, నాయకులు కొమ్ము రమేశ్, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, శివకుమార్, యాకయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

• సంగెం : పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాజేష్‌రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. సంగెం మండలం కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై నిలదీయాలంటే రాజేష్‌రెడ్డిని గెలించాలన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఇన్‌చార్జిలు కత్తెరపల్లి దామోదర్, యార బాలకృష్ణ, జున్న రాజు, సంగెం మాజీ సర్పంచ్ గుండేటి బాబు, పట్టభద్రుల కల్వర్ ఇన్‌చార్జిలు పెండ్లీ పురుషోత్తంరెడ్డి, మునుకుంట్ల చంద్రశేఖర్, బొమ్మల శంకర్, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలంటే రాజేష్‌రెడ్డిని గెలుపించుకోవాలని బీఆర్ఎస్ సంగెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్లీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లి, పోచమ్మ తండా, రేక్యానాయక్ తండాల్లో ఇంటింటికి తిరిగి గురువారం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో రాజేస్‌రెడ్డిని గెలిపించాలని వారు పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సంగెం మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ పోశాల ప్రవీణ్, నాయకులు బాబు, మల్లేష్, లింగమూర్తి, సుమన్, వీరు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి డ్రైవర్ ఆత్మహత్య



మృతుడు రాజు

చెన్నారావుపేట, మే 23 : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మగ్దుంపురంలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన తోట సమ్మక్క- భిక్షపతిల కుమారుడు తోట రాజు(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. 18 సంవత్సరాల క్రితం నర్సంపేట మండలం రాజపల్లెకి చెందిన రాణితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. 10 సంవత్సరాల క్రితం భార్య భర్తల మధ్య గొడవలు కావటంతో భార్య రాణి తన పిల్లలను తీసుకొని హైదరబాద్‌కు జీవనం కొనసాగిస్తుంది, ఈ క్రమంలో ఒంటరిగా ఉంటున్న రాజు మద్యానికి బానిసయ్యాడు. తన భార్య, పిల్లలు తిరిగి ఇంటికి వస్తారో రారోనని తీవ్ర మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి వెంటనే నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలి



ప్రచారం చేస్తున్న ఎంపీపీ, కాంగ్రెస్ నాయకులు

సంగెం, మే 23 : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్ట భద్రుల ఉప ఎన్నికల్లో ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి కోరారు. సంగెం మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ ఓటర్ల వద్దకు వెళ్లి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తీన్మార్ మల్లన్న సమస్యలపై ప్రశ్నించే ధైర్యమున్న నాయకుడని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు రమేష్, రాజు, రామకృష్ణ, రాజేష్, సాంబయ్య, మోహన్, శీను, తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నకు మొదటి పాధన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డిలు గురువారం పాపయ్యపేటలో పట్టాభద్రుల ఓటర్లను కలసి ప్రచారంనిర్వహించారు. విద్యావంతులు అలోచించి తీన్మార్ మల్లన్నకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మజ్జిక రాంబాబు, సునీల్, పూర లింగామూర్తి, భూక్య బాలాజీ, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న సభకు తరలిన నాయకులు

నెక్కొండ : నర్సంపేటలో నిర్వహించిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సభకు గురువారం నెక్కొండ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. మల్లన్న విజయం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుడి వలే పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు చల్లా శ్రీపాల్‌రెడ్డి, రాచకొండ రఘు, గ్రై లక్ష్మన్, రావుల తిరుపతిరెడ్డి, తిరుమల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనికరలో లక్ష్మీనర్సింహుని కల్యాణం

నెక్కొండ, మే 23 : మండలంలోని పనికరలో శ్రీ లక్ష్మీనర్సింహుని కల్యాణోత్సవం గురువారం కన్నుల పండువ గా జరిపారు. గ్రామానికి చెందిన గర్నెపల్లి ప్రతాపరెడ్డి దంపతులు కల్యాణోత్సవాన్ని జరిపించగా, ఇనుగాల వెంకట్‌రెడ్డి దంపతులు మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం ఎడ్ల బండ్ల ప్రదక్షణ నిర్వహించి, అనంతరం లక్ష్మీనర్సింహుల స్వామికి ఊరే గింపును నిర్వహించారు. కళ్యాణోత్సవ వేడుకలో రామసహాయం ఉపేందర్‌రెడ్డి, దేసు కుమారస్వామి, కపిల్, లక్ష్మణ్, కొత్త వీరారెడ్డి, ఇనుగాల శ్రీనివాసరెడ్డి, సముద్రాల అనిల్, కోలా లక్ష్మణ్, కాశబోయిన మల్లయ్య కొత్త సమిరెడ్డి, నాంచర్ల లక్ష్మణచారి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమబుద్ధ జయంతి

నెక్కొండ, మే 23 : ఆసియాజ్యోతి గౌతమబుద్ధుని జయంతి వేడుకలను నెక్కొండలోని అంబేద్కర్ భవనంలో గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించారు. గౌతమబుద్ధుడి సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నెక్కొండ మండల అధ్యక్షుడు గారే శ్యాంప్రసాద్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈదునూరి వెంకటేశ్వర్లు, మండలశాఖ అధ్యక్షుడు ఈదునూరి యాకుబ్, నాయకులు కొంగర సూర్యరావు, వద్దూరి కుమారస్వామి, తాటికాయల యాకయ్య, ఇటికాల సంజీవ, గడ్డం రమేష్, మందుల పరమాత్మ, శ్రీనివాస్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలి’



విత్తన షాపులను తనిఖీ చేస్తున్న ఏవో, ఏఈవోలు

నర్సంపేట, మే 23 : విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని నర్సంపేట మండల వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ అన్నారు. పట్టణంలోని పలు విత్తన షాపులను గురువారం ఏఈవోలతో కలిసి తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం అవసరమైన విత్తనాల కోసం రైతులు విత్తన షాపులకు వస్తున్నందున కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విత్తనాలను విక్రయించినా చట్టపరచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులు తొందరపడి పొడిదుక్కులు దున్ని విత్తనాలు విత్తుకొని నష్టపోవద్దని సూచించారు. రుతుపవనాలు వచ్చాక సరిపడా వర్షపాతం నమోద య్యాక విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఆధికృత డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలుచేసి రశీదులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రమించినా, డీలర్లు విత్తనాల కుత్రిమ కొరత సృష్టంచినా వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామ న్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మెండు అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి విక్రయాలు చేస్తే పీడీ, విత్తనాల, నిత్యావసరాల చట్టాల కింద కేసునమోదు చేస్తామని ఏవో చిలువేరు దయాకర్ హెచ్చరించారు. మండలంలోని పలు విత్తనాల విక్రయ, ఎరువుల షాపులను గురువారం తనిఖీచేసి మాట్లాడారు. డీలర్లు స్టాక్ వివరాలను, నమోదు చేయాలని, రైతులకు రశీదులు అందించాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా షాపుల వారు మెదలుకోవాలన్నారు. ఏలాంటి అవకతవకలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ధర్మారంలో ప్రచారం చేస్తున్న రాంబాబు

గీసుగొండ, మే 23 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఆయా పార్టీల తరపున మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ధర్మారంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాంబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా బ్యాలెట్ పత్రంతో పాటు వేసే విధానాన్ని వివరించారు. కాగా ఆరెపల్లి, ఎలుకుర్తిలలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కొమ్మాలలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపు కోసం జూలూరి లెనిన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల సమ్మేళనం

నర్సంపేట, మే 23: నర్సంపేటల పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపుకోసం మద్దతుగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. సమ్మేళనంలో పట్టభద్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.